

కథ 2008

1

# గాంధీగిరి

## తోలేటి జగన్మోహనరావు

ఎన్ని జన్మల వైరమో గాని నాకు మనశ్శాంతి లేకుండా చేసింది టైగర్. అంటే మా గ్రౌండ్ ఫ్లోర్ వాళ్ల పెంపుడు కుక్క.

ఆనంద్‌నగర్ కాలనీలో ఆ ఫ్లాట్ చూసీ చూడ గానే ఇష్టపడ్డాను. బాల్కనీ లోంచి ప్రతి గది కిటికీలోంచి ఎదురుగా ఉన్న పార్కు కనిపిస్తూ ఉంటుంది. అందు చేత కొంచెం ఖరీదు ఎక్కువైనా వెంటనే కొనేశాను, లక్కీగా ఆ ఫ్లాట్ దొరికిందని పొంగిపోతూ. కానీ, ఫ్లాట్‌లో దిగినరోజు నుంచే నా కష్టాలు ప్రారంభమ య్యాయి.

మా కాలనీలో బ్లాకులన్నీ నాలుగు అంతస్తులవి, లిఫ్టు లేదు. ప్రతీ బ్లాకులోనూ అటు నాలుగు, ఇటు నాలుగు ఫ్లాట్లు. పైకి వెళ్లడానికి మధ్యలో మెట్లు. ఫ్లాట్‌లో దిగిన రోజు సాయంత్రం కూరలు కొనుక్కుని హుషారుగా వస్తుంటే మెట్ల దగ్గర ఒక కుక్క కనిపిం చింది. చిన్న తల, మధ్యలో పెద్ద పొట్ట. మళ్లీ తోక దగ్గర సన్నగా. అదేం జాతి కుక్కో కాని ఊరపందిలా అడ్డంగా బలిసి వింతగా ఉంది. గ్రౌండు ఫ్లోరు వాళ్లు దాన్ని మెట్ల దగ్గర కట్టేశారు.

నేను మెట్లెక్కబోతుంటే అది భౌ అంటూ నా మీదకు దూకింది. నేను ఉలిక్కిపడి రెండడుగులు వెనక్కు గెంతాను. నేను అడుగు ముందుకు వేసినప్పు డల్లా అది అరుస్తూ నా మీదకు దూకి దారి అటకా యించ సాగింది.

'వీళ్లకి సివిక్ సెన్సు లేదు. మెట్ల దగ్గర వెధవ కుక్కని కట్టేశారు,' అని విసుక్కుంటూ గ్రౌండ్ ఫ్లోర్లో ఎవరున్నారా అని చూశాను. తలుపు పక్క నేమ్‌ప్లేటు మీద 'జి. పాపారావు,' అని కనిపించింది.

నేను విసుగ్గా కాలింగ్ బెల్లు నొక్కాను. లోపల గంట గణగణలాడింది. కాని తలుపులు తెరుచు కోలేదు.

“పాపారావుగారూ... పాపారావుగారూ,” అని కేక లేస్తూ తలుపులు దబదబ బాదుతూ, కాలింగు బెల్లు నొక్కుతూ, అయిదు నిమిషాలు తంటాలు పడ్డాక, తలుపు మెల్లిగా తెరుచుకుని ఓ భీకరాకారం ప్రత్యక్ష మైంది.

అయిదున్నరడుగుల పొడవు... దాదాపు అంతే వెడల్పున్న... చాకలిబాన మీద ఫుట్‌బాలు పెట్టినట్లు మెడ కనిపించకుండా తల... బానపొట్ట కింద అడ్డ దిడ్డంగా గళ్ల లుంగీ... అంటకత్తెర వేసిన తల... ఎర్రగా ఉబ్బిన కళ్లు. నాకు చాలా ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే ఆయనకీ, ఆయన కుక్కకీ చాలా పోలికలున్నాయి. ఆ కుక్కని అయిదున్నరడుగుల పొడుగు, వెడల్పులకు సాగదీసి, రెండు కాళ్ల మీద నిలబెట్టి మనిషి రూపం ఇస్తే ఎలా ఉంటుందో అలా ఉన్నాడాయన. నిద్ర లేచాడో లేక మందు సీసా కింద పెట్టి వచ్చాడో తెలియదు కానీ, అసురసంధ్యవేళ నిద్ర లేచిన రాక్షసుడిలా ఉన్నాడు ఆయన.

తలుపు మెల్లిగా తీసి ఏవీ మాట్లాడకుండా, నన్ను పై నుంచి కింది దాకా పురుగుని చూసినట్లు మెల్లిగా చూశాడు.

ఆ చూపుకు నేను కొంచెం తడబడి, “నమ స్కారం పాపారావుగారూ. నేను పైఫ్లాట్లో ఇవ్వాళే దిగాను. నా పేరు బి.ఎస్. రావు. బి. సన్యాసిరావు. మిమ్మల్ని

కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది,'' అంటూ రాని సంతోషం మొహం మీదకు తెచ్చుకుని చెయ్యి ముందుకు చాపాను.

నన్ను కలుసుకోవడం సంతోషంగా ఉందో లేదో చెప్పలేదు ఆయన. 'అసలు నేనన్నది ఆ ఫుట్‌బాలులోకి వెళ్లిందా,' అని నాకు సందేహం కలిగింది. నా సందేహ నివృత్తి చేస్తూ రాక్షసుడి కుడిచెయ్యి మరమనిషి చెయ్యి లేచినట్లు స్లోమోషన్లో లేచి నా చెయ్యి గట్టిగా పట్టుకుంది. అది మనిషి స్పర్శలా లేదు. గోడకో, స్తంభానికో ప్రాణం వచ్చి నా చెయ్యి పట్టుకున్నట్లనిపించింది.

"మీ కుక్క... నన్ను... పైకి వెళ్లనివ్వడంలేదు."

రాక్షసుడు నన్ను మళ్లీ ఓ నిమిషం మెల్లిగా చూసి, కుక్కకేసి తిరిగి "టై...గ...ర్...ర్," అని అరిచాడు. పులి గాండ్రించినట్లయింది. టైగర్ మెట్ల దగ్గర నుంచి కదలి తోకాడిస్తూ ఆయన దగ్గరకు వెళ్లింది. ఆయన మరి మాట్లాడకుండా ధన్‌మని నా మొహం మీదే తలుపేసేశాడు. నాకేసి చూడనైనాలేదు. 'ఈయనకి మేనర్సు లేదు,' అనుకుంటూ నేను మెట్లెక్కాను.

పాపారావుగారికి అలా కంప్లెయింట్ చేసినందుకు టైగర్‌కి కోపం వచ్చిందనుకుంటా. వీడికి మన తడాఖా చూపించాలి అని నిశ్చయానికొచ్చినట్లు నేను మెట్ల దగ్గర కనిపించినప్పుడల్లా 'బొంయిమ'ని మొరుగుతూ నా మీదకు దూకడం మొదలుపెట్టింది.

"ఏవిటి మాష్టారూ ఈ న్యూసెన్సు...' అన్నాను పారారావుగారితో కొంచెం విసుగ్గా.

"న్యూసెన్సు చేస్తున్నది మీరా? నేనా?" ఎదురు తిరిగాడు ఆయన.

"నేను న్యూసెన్సు చేస్తున్నానా?"

"కాకపోతే ఏమిటి? పైన ఆరు ఫ్లాట్ల వాళ్లు తిరుగుతున్నారు. ఎవరి దగ్గర నుంచీ ఏ కంప్లెయింటూ లేదు. మీరు ఒక్కళ్లే గోల చేస్తున్నారు."

"నేను గోల చేస్తున్నానా?"

"ఇది గోల కాదా?"

మా సంభాషణ అలా టీవీ సీరియల్ సంభాషణలా ముందుకి కదలకుండా సాగుతుంటే నల్లపిల్లి ఒకటి తాపీగా నడుస్తూ వచ్చి, ఒక క్షణం ఆగి మా సంభాషణ ఆలకించి మళ్లీ కదిలింది. పాపారావుగారి కాళ్ల దగ్గర పడుకుని, మా కామెడీ షో చూస్తూ ఆనందిస్తున్న టైగర్, నల్లపిల్లి కంటపడగానే భౌ అని అరుస్తూ దాని మీదకు దూకింది.

నల్లపిల్లి ట్రెపీజ్ ఆర్టిస్టులా మెట్ల మీదకు ఒక గెంతు గెంతి, అక్కడ నుంచి మొదటి అంతస్తు వంటింటి కిటికీ సన్‌షేడ్ మీదకు ఇంకో గెంతు గెంతి, 'ఇప్పుడేం చేస్తావు బే,' అన్నట్లు వెనక్కు తిరిగి టైగర్ కేసి నిరసనగా చూసింది. దాన్ని తరుముకుంటూ మెట్ల మీదకు దూకిన టైగర్ మెట్ల మీంచి ఉడుకుమోత్తనంతో అరవసాగింది.

పాపారావుగారిని కౌంటర్ చెయ్యడానికి నాకు ఒక పాయింటు దొరికింది. "... మరి ఈ పిల్లి మీద ఎందుకు దూకింది?"

"కాలనీలో ఇన్ని పిల్లులుండగా నల్లపిల్లి మీదే ఎందుకు దూకింది?" ఆయన ఎదురు ప్రశ్న వేశాడు.

ఇల్లాంటి ప్రశ్నలకి ఎలా స్పందించాలో ఏ యూనివర్సిటీ నాకు నేర్పలేదు.

"అవును. నల్లపిల్లి మీదే ఎందుకు దూకింది?" అన్నాను అయోమయంగా.

"మిమ్మల్ని చూస్తేనే ఎందుకు మొరుగుతోంది?"

"అవును ఎందుకు మొరుగుతోంది?"

"అది పోలీస్ కుక్క. టెర్రరిస్టులను, దొంగలను ఇట్టే పసిగట్టేస్తుంది."

"నేను టెర్రరిస్టునా?"

"ఏమో..."

"నల్లపిల్లి కూడా టెర్రరిస్టేనా?"

''టెర్రరిస్టో, టెర్రరిస్టులకి కొరియర్‌గా పని చేస్తోందో? ఎవరికి తెలుసు?'' పోలీసు లాజిక్‌కి తిరుగు లేదు.

"ఏది ఏవైనా మీరు మెట్ల దగ్గర కుక్కని అలా కట్టకూడదు," అన్నాను గట్టిగా.

"కట్టకూడదా?" అన్నారు ఆయన శాంతంగా.

ఆయన అలా శాంతంగా మాట్లాడడం చూసి నాకు ధైర్యం వచ్చింది. ''కట్టకూడదు...'' అన్నాను ఇంకొంచెం గట్టిగా.

"అయితే సరే..."

పాపారావుగారిని అలా అదరగొట్టగలిగినందుకు సంతోషించి నేను ఆఫీసుకు వెళ్లాను. సాయంత్రం ఆఫీసు నుంచి తిరిగి వచ్చేటప్పటికి, నాకు స్వాగతం చెప్పడానికి టైగర్ మెట్ల దగ్గర కాసుకు కూర్చుని ఉంది. గేటులోంచి లోపలకు అడుగు పెట్టగానే భౌ అంటూ నా మీదకు దూకింది. నేను గేటు బయటకు గెంతి, "పాపారావుగారూ... ఓ పాపారావుగారూ," అని రోడ్డు మీంచి అరవసాగాను.

నా ఆర్తనాదాలు విని ఝాన్సీ కంగారుగా పరిగెట్టుకొచ్చింది.

''ఈ కుక్క నన్ను లోపలికి రానివ్వడంలేదే,'' అన్నాను దీనంగా.

''ఏం ఫరవాలేదు. నా చెయ్యి పట్టుకురండి. అది అరిచిందంటే పీక పిసికేస్తాను.''

''కరుస్తుందేమో?''

''కరిస్తే కాళ్లు విరిచేస్తాను. పదండి.''

ఝాన్సీ పేరుకు తగ్గట్టుగానే రాణీ లక్ష్మీబాయి లాంటి ధైర్యస్తురాలు. సన్నగా ఉంటుంది కాని, అయిదడుగుల ఆరంగుళాల పొడవు, బలంగా ఉంటుంది. ''నువ్వు ఎం.ఎ. ఫిలాసఫీ చేశావు కాని పి.టి. ఉషలాగ అథెలిటెక్సులో దిగితే ఒలింపిక్స్‌లో గోల్డు మెడలొచ్చేసేది,'' అని వేళాకోళంగా అంటుంటాను ఝాన్సీతో.

ఝాన్సీ పెర్సనాలిటీ చూసో లేక ఝాన్సీ వార్నింగు అర్థమయ్యో టైగర్ నోరు మూసేసింది.

ఝాన్సీ ఎస్కార్టుగా నేను గేటు దాటాను.

'పెళ్లాం కొంగు చాటున దాక్కునే మగాడా, చెయ్యి వదిలి చూడు ఏమవుతుందో,' అన్నట్లు చూపులతో వార్నింగిస్తూ టైగర్ నిశ్శబ్దంగా మమ్మల్ని అనుసరించింది.

మేం మెట్లెక్కబోతుంటే పాపారావుగారు తలుపు తీసి బయటకు వచ్చారు.

''ఏవిటిది మాష్టారూ, కుక్కని అలా వదిలేశారు?'' అన్నాను.

''మెట్ల దగ్గర కట్టద్దన్నారు కదా,'' అన్నాడు ఆయన తాపీగా.

పాపారావుగారూ, ఆయన కుక్క నా మీద పగ బట్టారని నాకు అర్థమైంది. ఇంక నా లెవెల్లో కాక ఎసోసియేషన్ లెవెల్లో డీల్ చెయ్యాలనుకుని, మా రెసిడెంట్సు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంటుగారి దృష్టికి ఈ విషయం తీసుకువచ్చాను.

''చూడండి శర్మగారూ, పాపారావుగారు కాలనీలో వాళ్లని ఇలా ఇబ్బంది పెట్టకూడదు. ఆయనకు కొంచెం చెప్పి చూడండి.''

శర్మగారికి సాంవత్సరిక సభ్యత్వ రుసుము అంటూ నా దగ్గర నుంచి అయిదు వేలు గుంజడంలోనూ, జనవరి 26కి, ఆగస్టు 15కి జండాలెగరేసి వార్డు కౌన్సిలర్ల దగ్గర నుంచి మంత్రుల దాకా భుజాలు కలిపి తిరుగుతూ పరిచయాలు, పలుకుబడులూ పెంచుకోవడంలో ఉన్న ఉత్సాహం, ఇలాంటి తగాదాల్లో తల దూర్చడంలో ఉండదు. ఆయన లౌక్యులు.

''నేనో మాట చెప్పనా సన్యాసిరావుగారూ, కుక్క జట్టీలు పెద్ద తగాదా చెయ్యకూడదండి. మీకు తెలుసో తెలియదో ఆయనది పోలీసు డిపార్టుమెంటు. పోలీసోళ్లతో గొడవెందుకు?''

''నే గొడవ పడుతున్నానా? ఆయన గొడవ పెడుతున్నాడా?''

''ఆకు ముల్లుమీద పడ్డా, ముల్లు ఆకుమీద పడ్డా మనం పోలీసాడితో తగువు పెట్టుకున్నా, పోలీసాడు మనతో తగవు పెట్టుకున్నా రిజల్టు ఒకటే మాష్టారూ,'' శర్మగారు గొంతు కొంచెం తగ్గించి రహస్యం చెబుతున్నట్టు అన్నారు. ''నన్నడిగితే పోలీసులు చేసినన్ని నేరాలు, ఘోరాలు ఎవ్వరూ చెయ్యరంటాను. వాళ్లకి చట్టం బేకింగు ఉంటుంది కాబట్టి, మామూలు నేరస్తుల కంటే ప్రమాదకరమైనవాళ్లు. పోలీసులు లైసెన్సుడు గూండాలు సార్. ఈ దేశాన్ని పోలీసుల నుంచి దేముడే కాపాడాలి. అందుకని నా మాట విని సర్దుకుపొండి,'' అంటూ కర్ర విరక్కుండా, పాము చావకుండా లౌక్యంగా మాట్లాడి తనేమీ చెయ్యలేనని చేతులెత్తేశారు శర్మగారు.

పోనీ శర్మగారు సలహా ఇచ్చినట్లు సర్దుకుపోదామా అంటే, ఝాన్సీ తోడు లేకుండా నేను కదలలేకపోతున్నాను. ఒకరోజు పొరుగింటావిడతో ఝాన్సీ మేటనీ షోకి వెళ్లింది. ఆవిడ సినిమా నుంచి తిరిగి వచ్చే దాక నేను గేటవతల ఎండలో మాడిపోవాల్సి వచ్చింది. పైకి ఎవ్వరూ ఏవీ అనడం లేదుకాని, కాలనీ వాళ్లందరూ నా అవస్థ చూసి నవ్వుకుంటున్నారని నాకు తెలుసు.

రోగం రొష్టు చెయ్యాలనేది మా బామ్మ. అంటే మనకి ఏదైనా కష్టం వస్తే అడిగినవారికి, అడగనివారికి-అందరికీ చెప్పుకోవాలన్న మాట. ఎవరికి తోచిన సలహాలు వాళ్లు ఇస్తారు. ఒక్కొక్కసారి అదృష్టవశాత్తు మన రోగానికి మందు కూడా తెలియవచ్చు. బామ్మ మాట బంగారుమాటలా భావించే నేను ఒకరోజు ఆఫీసులో లంచ్‌టైంలో అడిగినవారికి, అడగనివారికి అందరికీ నా గోడు వినిపిస్తూ, ''ఇలా ఎంతకాలం? పదిహేను లక్షలు పెట్టి కొన్న సొంత ఫ్లాట్‌లోకి అడుగు పెట్టలేకపోతున్నాను,'' అని ఘొల్లుమన్నాను.

''పోలీసులతో గొడవ పెట్టుకోకు,'' అందరూ అదే సలహా ఇచ్చారు.

''మీకందరికీ పిచ్చెక్కిందా? నేను తగాదా పెట్టుకున్నానా లేక పాపారావుగారు ఆయన కుక్కని, గంగిగోవులాంటి నా మీదకు ఉసిగొల్పుతున్నాడా?''

''ఏ పాపారావు?'' డి.జె. అంటే డి. జగన్నాథరావు అడిగాడు.

''ఎ. పాపారావు కాదు, జి. పాపారావు.''

"జి. పాపారావు అంటే గన్ పాపారావు. వాడా? వాడు పరమ దుర్మార్గుడు."

"నీకెలా తెలుసు?"

"మా కజిన్ పోలీసు డిపార్టుమెంటులో ఉన్నాడు కదా- వీడి సంగతి చెప్పాడు. ట్రిగ్గర్ హేపీ బగ్గర్- ప్రమోషన్ కోసం ఖమ్మం దగ్గర ఇద్దరు కాలేజీ కుర్రాళ్లని నక్సలైట్లని చెప్పి ఎన్‌కౌంటర్ చేసేశాడు. కోల్డు బ్లడెడ్ మర్డరర్- డిపార్టుమెంట్ అంతకీ తెలుసు..."

ఆ మాట వినగానే నా గుండె ఒకక్షణం ఆగిపోయింది. పోయిపోయి అంత దుర్మార్గుడితో తగాదా పెట్టుకున్నందుకు- వినివిని లోకం భాష నాకు కూడా వచ్చేసినట్లుంది- తగాదా వచ్చినందుకు భయం వేసింది.

"అందుకనే కాబోలు నేను టెర్రరిస్టేమోనని అనుమానంగా ఉందన్నాడు పాపారావు..." అన్నాను భయం భయంగా.

"అన్నాడా? అంటే పై ప్రమోషన్ మీద కన్నేశాడన్న మాట..."

నా గుండె ఇంకో క్షణం ఆగిపోయింది.

"భయపడకు," పాలిపోయిన నా మొహం చూసి ధైర్యం చెప్పాడు డీజే.

"నిన్ను ఎన్‌కౌంటర్ చేసేస్తాడని నేననడంలేదు. అంతపని చెయ్యకపోవచ్చు. కాని నీ ఇంట్లో బాంబులు, గన్‌లు, ఎకె47లు దొరికాయని ఓ కేసు తగిలిస్తాడు. వెంటనే సస్పెండయిపోతావు. కేసు పది, పదిహేనేళ్లు నడుస్తుంది. ఈ పదిహేనేళ్లు పోలీసుస్టేషన్లు, కోర్టులు, జెయిళ్లు చుట్టూ ప్రదక్షిణాలు- ఈలోగా లాయర్లు నిన్ను రాబందులు పీక్కు తిన్నట్లు తినేస్తారు..." రాంగోపాల్ వర్మ 'షాక్' చిత్రంలాంటి భయంకర చిత్రం చూపించాడు డీజే.

సినిమా చివరన, సినిమాస్కోపు తెరంత సెంట్రలు జెయిలు గేటులో ఉన్న చిన్న తలుపు తెరుచుకుని, నెరసిపోయిన జుట్టుతో వార్ధక్యంతో వంగిపోయిన బి. సన్యాసిరావు బయట ప్రపంచంలో అడుగుపెట్టి తలెత్తి, కళ్లు చికిలించి ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షులకేసి చూస్తున్న దృశ్యం నా కళ్ల ముందు మెదలి, "చచ్చిపోయానురోయ్," అంటూ రెండు చేతుల్లోనూ తల పట్టుకుని కూలిపోయాను.

"భయపడకు సన్యాసి. నీ ప్రాబ్లం సాల్వు చెయ్యడానికి ఇంకో మార్గం ఉంది." డీజే కొత్త స్క్రిప్టు బయటకు తీశాడు. "శంకర్‌దాదా జిందాబాద్ సినిమా చూశావా?"

"ఇంకా చూడలేదు. నిన్నే కదా రిలీజయింది."

"చూస్తే మన ఐడియా తెలిసేది. గాంధీగిరితో నీ సమస్య శాంతియుతంగా పరిష్కరిద్దాం."

"గాంధీగిరి ఏమిటి?"

"గూండాగిరికి ఆపోజిట్ గాంధీగిరి..."

ఆ సినిమాలో ఒక గూండా అహింసావాది అయిపోయి, అన్ని సమస్యలూ శాంతియుతంగా పరిష్కరించేసి విలనుగాడి హృదయం మార్చేసి, హీరోయిన్ హృదయం జయించేస్తాడట.

"అహింస, సత్యం, ప్రేమల ద్వారా పాపారావు గారిని, టైగర్‌ని జయించాలి," అన్నాడు డీజే.

డీజే ఐడియా నాకు చాలా నచ్చింది. నేను శాంతి ప్రియుడిని- ఆ మాటే మరోరకంగా చెప్పాలంటే చచ్చే భయస్తుడిని. నాకు పోలీసులు, కోర్టులు, జెయిళ్లు అంటే చచ్చే భయం.

మన మెడకాయ మీది తలకాయ సేఫ్‌గా ఉంచుకొని పాపారావుగారిని ప్రేమతో మార్చగలిగితే అంతకంటే నాకు కావల్సిందేం వుంది? కాని ఆయన...

"వట్టి పాపారావు కాదు, గన్ పాపారావు. గాంధీగిరికి లొంగుతాడంటావా?" అన్నాను అనుమానంగా.

"గాంధీయిజానికి తెల్లవాడే తోక ముడిచాడు, గన్ పాపారావు ఒక లెక్కా?"

సాయంకాలం ఆఫీసు నుంచి వస్తూ గాంధీజీ ఆత్మకథ 'సత్యశోధన', గాంధీయిజం గురించి పుస్తకాలు కొనుక్కొచ్చాను. రాత్రి పడకగదిలో నేను గాంధీజీ ఆత్మకథ అధ్యయనం చేస్తుండగా, ఝాన్సీ పని ముగించుకొని వచ్చి పక్కన కూర్చుంటూ, "ఏవిటి ఎన్నడూ లేనిది టీవీ సీరియల్సు వదిలేసి సీరియస్ పుస్తకాలు చదువుతున్నారు," అని ఆశ్చర్యపోయింది.

"ఈరోజు నుంచి నేను గాంధీవాదినైపోయాను." ఝాన్సీకి గాంధీగిరి గురించి వివరించాను. "మనం పాపారావుగారినీ, టైగర్‌నీ ద్వేషించకూడదు. అహింస, సత్యం, ప్రేమల ద్వారా వాళ్ల మనసులు జయించాలి. నేను సీరియస్‌గా గాంధీగార్ని స్టడీ చేస్తున్నాను. ఆయన లాగే నేను సత్యం, అహింసలతో ప్రయోగాలు చేస్తాను. కొంచెం నీ కో-ఆపరేషన్ కావాలి."

"తప్పకుండా," ఝాన్సీ హామీ ఇచ్చింది.

"సంసారం చేస్తారా? బ్రహ్మచర్యం పాటిస్తారా?"

నేను ఉలిక్కిపడ్డాను. "గాంధీజీ బ్రహ్మచర్యం పాటించేవారా? నాకు తెలియదే?"

"నాకూ సరిగా తెలియదు. అలా అని ఎక్కడో చదివిన గుర్తు."

"అవును నాయనా, నా సత్యశోధనలో బ్రహ్మ చర్యం కూడా ఉంది," ఆత్మకథ పేజీల్లోంచి ప్రత్యక్షమై అన్నారు గాంధీజీ. "బ్రహ్మచర్యమనగా భగవంతుడిని దర్శించుట..."

"నేను భగవంతుణ్ణి దర్శిస్తా మహాత్మా," ఉత్సా హంగా అంటూ భక్తిశ్రద్ధలతో మహాత్ముడికి నమస్క రించాను.

"చాలా సంతోషం నాయనా, నీకు మాత్రమే కని పిస్తూ నిన్ను సత్యపథంలో నడిపిస్తాను," ఆశీర్వదిం చారు గాంధీజీ.

"ధన్యుణ్ణి స్వామీ," అంటూ గాంధీజీకి కృత జ్ఞతలు తెలుపుకుని, ఝాన్సీతో, "నేను ఈ క్షణం నుంచి బ్రహ్మచర్యం పాటిస్తున్నాను," అన్నాను ఒకడుగు దూరం జరిగి.

"సంసారం సాగించినా, బ్రహ్మచర్యం పాటిం చినా- దేనికైనా సరే, నా ఫుల్ కో ఆపరేషనుంటుంది," అంది ఝాన్సీ, తను కూడా రెండడుగులు దూరం జరుగుతూ.

"గుడ్. నిప్పుకీ, పెట్రోలుకి మధ్య ఈ మూడ డగుల దూరం ఇల్లాగే ఉండాలి."

మర్నాడు ఉదయం నేను పూలగుచ్ఛం, కుక్క బిస్కెట్ల పాకెట్టు తీసుకొని పాపారావుగారింటి తలుపు తట్టాను. పాపారావుగారు తలుపు తియ్యగానే నేను విన యంగా తల వంచి, ముప్ఫై రెండు పళ్ళూ కనిపించేలా మందహాసం చేసి, సుప్రభాతం చెప్పాను. పాపారావు గారు నా చేతిలో పూలగుచ్ఛం కేసి ఒకక్షణం ఆశ్చర్యంగా చూసి, నాకేసి ప్రశ్నార్థకంగా చూశారు. పాపారావుగారి కాళ్ళ దగ్గర పడుకున్న టైగర్ వచ్చింది శత్రువో, మిత్రుడో అర్థంకాక తోక ఎత్తి అవసరమైతే మీద దూకడానికి వీలుగా స్ప్రింగులా లేచి నిలబడింది.

"పాపారావుగారూ," నేను చిరునవ్వు చెదిరిపో కుండా అన్నాను, "ఏ కారణాల వల్లనైతేనేమి నాకూ, మీకు, టైగర్‌కి మధ్య అభిప్రాయభేదాలు, అపార్థాలు తలెత్తి ఉద్రిక్తతకు దారితీశాయి. మీకు, టైగర్‌కి నా ప్రవర్తన చికాకు కలిగించినందుకు చింతిస్తున్నాను. గతం మరిచిపోయి ఇవ్వాల్టి నుంచి మనం స్నేహితు లుగా ఉందాం."

పాపారావుగారి మొహం మీద తుమ్మల్లో పొద్దు గుంకినట్లు స్నేహపూర్వకమైన నవ్వు ఒకటి వెలిసింది. మారిన పరిస్థితి క్షణంలో గ్రహించేసింది టైగర్. నా చేతి లోని బిస్కట్ పాకెట్టు లాక్కుని, స్నేహపూర్వకంగా తోకాడిస్తూ నా చుట్టూ తిరిగింది.

"వట్టి స్నేహితులం అంటే ఒప్పుకోను," పూల గుచ్ఛం అందుకొంటూ పాపారావుగారు ప్రొటెస్టు చేశారు.

"...గాఢ స్నేహితులం. మన స్నేహం మూడు గులాబీలు, ఆరు మల్లెల్లా పెరగాలి. సాయంకాలం మల్లెపూలు కూడా తీసుకు వస్తూ ఉండండి."

పదింటికి ఆఫీసుకు బయలుదేరుతూ, "తలు పేసుకో. నేను వెడుతున్నాను," అన్నాను ఝాన్సీతో.

"ఒక్కక్షణం, నేనూ వస్తున్నాను."

"ఇవ్వాల్టి నుంచి నువ్వు తోడు రానక్కర్లేదు."

ఝాన్సీ ఆశ్చర్యంగా చూస్తుండగా, నిర్భయంగా ఒక్కడినీ మెట్లు దిగాను. మెట్ల దగ్గర టైగర్‌కి గుడ్ మార్నింగ్ చెప్పి, తల నిమిరి ఓ బిస్కెట్ పడేసి, సాయంత్రం గేటు దగ్గర గుడ్ ఈవినింగ్ చెప్పి, ఇంకో బిస్కెట్ పడేసి, తోకాడించుకుంటూ టైగర్ ఫాలో అవు తుండగా ఇంట్లో అడుగుపెట్టాను, చేతిలో మల్లెపూల దండతో.

"మల్లెపూలు నీకోసం కాదు, మిసెస్ పాపారావు గారికి."

మర్నాడు కూడా పాపారావుగారికీ, టైగర్‌కీ గుడ్ మార్నింగ్, గుడీవినింగ్‌లు చెప్పాను. అలా కొన్ని రోజులు పూలు, బిస్కెట్లు ఇస్తే సరిపోతుందనుకున్నాను. కాని క్రమంగా పాపారావుగారి సూచన, కోరిక లేక డిమాండు మేరకు పూలు, పళ్ళే కాకుండా వందలు ఖర్చుపెట్టి ఆయన అడుగుతున్నవన్నీ కొనాల్సిన పరిస్థితి వచ్చింది. అలా చెయ్యకపోతే స్నేహం, ప్రేమ నిలిచేట్లులేవు. గాంధీగిరికి చాలా ఖర్చవుతోందే అని మనసు చివుక్కు మంది.

"అహింస ఆచరించదలచినవారు తమ ఆత్మ గౌరవం తప్ప అన్నింటినీ త్యాగం చేయుటకు సిద్ధపడ వలెను నాయనా," అన్నారు గాంధీజీ.

వెధవ డబ్బు పోతేపోయింది- పాపారావుగారు, టైగర్ నా ఆత్మను గౌరవిస్తున్నారని సంతోషిస్తూ ఓ మల్లె పూలదండ తీసుకొని ఇంట్లో అడుగుపెట్టగానే ఝాన్సీ ఎదురొచ్చి, "ఆ దండ ఇవ్వాళ నా మొహాన తగలె య్యొచ్చు. పాపారావుగారు టూరుకెళ్లారు," అంది.

"టూరు కెడితే? మల్లెపూలు పెట్టుకునేది ఆయనా? ఆవిడా? పైగా ఆయన ఉన్నప్పుడు ఒకలా గానూ, ఆయన లేనప్పుడు ఒకలాగానూ ప్రవర్తిస్తే సత్య సంధత ఎక్కడుంది?"

గాంధీజీ నా సత్యనిష్టతను మెచ్చుకోలుగా చూశారు. కానీ ఝాన్సీ, "మహాత్మా మీ గొప్ప హృదయం నేను అర్థం చేసుకోలేకపోయాను. వెళ్లి ఆవిడ జడలో పూలు పెట్టి రండి," అంటూ నమస్కరించింది.

వారం రోజుల తర్వాత పాపారావుగారు టూరు నుంచి వచ్చారు. నేను ఉదయమే గుడ్‌మార్నింగ్ చెప్పి పూలగుచ్ఛం అందిస్తుంటే ఆయన, "చూడండి మాష్టారు, నేను లేనప్పుడు రాత్రిళ్లు మా ఆవిడకి మల్లె పూలు ఇవ్వక్కర్లేదు," అన్నారు కొంచెం చికాకుగా.

'నా గాంధీగిరిలో ఏ లోపం జరిగిందా, ఆయనకు ఎందుకు కోపం వచ్చిందా, ' అని మథనపడుతూ ఇంట్లోకి అడుగుపెట్టాను.

"మొహం అలా మాడిన పెసరట్టులా అయిం దేవిటి మహాత్మా?" ఝాన్సీ అడిగింది. విషయం చెప్పి ఆయనకు ఎందుకు కోపం వచ్చిందంటావు?" అనడిగాను.

"గాంధీగిరి డోసు ఎక్కువైంది కాబోలు," ఫక్కున నవ్వింది ఝాన్సీ.

"గాంధీయిజాన్ని పరిహసించడం నేను సహిం చను," ఝాన్సీతో తీవ్రంగా చెప్పాను. ఝాన్సీ, సారీ చెప్పింది. కాని నిరసనగా ఒకరోజు మౌనవ్రతం, ఆత్మ శుద్ధికి రెండురోజులు ఉపవాసం పాటించాను.

మూడునెలల గాంధీగిరి తర్వాత మేమిద్దరం ఒక రోజు ఉపవాసం చెయ్యాల్సిన పరిస్థితి వచ్చింది. అలా రోజురోజుకు పెరిగిపోతున్నాయి పాపారావుగారి డిమాండ్లు.

"మహాత్మా నేనయితే ఉపవాసాలతో నాజూగ్గా తయారవుతున్నాను కాని అసలే గడకర్రలా ఉండే తమరు చీపురుపుల్లలా అయిపోతున్నారు," అని ఝాన్సీ ఒకక్షణం విచారించి, "అదీ మంచిదేలెండి. గేటు దగ్గర నిలబడితే ఆఫీసుకు ఎగిరిపోతారు, కాణీ ఖర్చుండదు," అని సంతోషించింది.

"మనం అష్టకష్టాలు అనుభవించాలి, త్యాగాలు చెయ్యాలి. కాని టైగర్‌కి కాని, పాపారావుగారికి కాని ఏ లోటూ చెయ్యకూడదు," అన్నాను దృఢంగా.

సత్యాహింసలతో నా ప్రయోగాలు అలా సాగు తుండగా, నేను ఆఫీసు పనిమీద పదిహేను రోజుల పాటు టూరు వెళ్లాల్సి వచ్చింది. 'నేను లేని లోటు టైగర్‌కి కాని, పాపారావుగారికి కాని కనిపించకూడదనీ, అన్నీ మామూలుగా జరగాలని,' ఝాన్సీకి మరీమరీ చెప్పి రైలెక్కాను. "అయ్యో అలా ఎలా చేస్తాను? మీరు నిశ్చింతగా వెళ్లి రండి," అంటూ సాగనంపింది.

పదిహేనురోజుల తర్వాత టూరు నుంచి తిరిగి వచ్చి కాలనీలో అడుగుపెట్టగానే మనసు ఏదో కీడు శంకించింది. కళకళలాడుతూ ఉండాల్సిన కాలనీ లంఖిణి లేని లంకలా వెలవెలబోతూ కనిపించింది. గేటు దగ్గర కాని, మెట్ల దగ్గర కాని టైగర్ తోకాడిస్తూ ఎదురు కాలేదు.

"ఏవిటి ఏదో తేడా కనిపిస్తోంది? టైగర్ బాగానే ఉందా?" అనడిగాను ఆందోళనగా.

"పదిహేను రోజుల నుంచి పెళ్లాం ఒంటరిగా ఎలా ఉంది అన్న ఆందోళన లేదు, టైగర్ యోగ క్షేమాలు విచారిస్తున్నారు. మహాత్ములకు జంతువులే తప్ప మనుషులు ఆనరు కాబోలు..."

"నీకేం నువ్వు ఆడభీముడిలా దుక్కలా ఉన్నావు. టైగర్ ఏవైంది?"

మా కాలనీలో టైగర్‌కి నేను కాకుండా మరో శత్రువు, నల్లపిల్లి ఉందికదా! నల్లపిల్లికి గాంధీగిరి గురించి తెలియదు కనుక టైగర్ నల్లపిల్లి మధ్య శత్రుత్వం అలాగే కొనసాగుతోంది. ఒకరోజు టైగర్ నల్లపిల్లిని తరుముతూ టెర్రస్ మీదకు వెళ్లిపోయిందట.

"దాన్ని తరుముతున్న టైగర్ కూడా దూకి, సన్ షేడ్ మీద బేలన్సు తప్పి తిన్నగా నేలమీద పడి... కాళ్లు విరగ్గొట్టుకుంది," అంది ఝాన్సీ.

ఆ వార్త వినగానే 'పీడ విరగడైంది,' అని ఓ క్షణం సంతోషించింది నా మనసు.

"తప్పు నాయనా," గాంధీజీ మందలించారు. "నిజమైన అహింసయనగా కోపము, ద్వేషము అనెడి ఆలోచనల నుండి విముక్తి పొందుట. శత్రువును ప్రేమతో కౌగిలించుకొనుట."

టైగర్ కాళ్లు విరిగినందుకు అంత అమానుషంగా సంతోషించినందుకు నన్ను నేను మందలించుకుని, 'మహాత్మా క్షమించు,' అని మహాత్ముడిని వేడుకుని, ఆత్మశుద్ధికి ఒకరోజు ఉపవాసం ఉండాలని నిర్ణ యించుకున్నాను.

"పాపారావుగారు ఎలా ఉన్నారు?"

"నల్లపిల్లి మూలంగా టైగర్ కాళ్లు విరిగాయని తెలియగానే పాపారావుగారికి పిచ్చి కోపం వచ్చేసింది. ఆయన్ని గన్ పాపారావని ఎందుకంటారో అప్పుడు తెలిసింది నాకు. నల్లపిల్లి దొరకలేదు కాని ఆ రాత్రి ఆయన గన్ తీసుకొని కాలనీలో మూడు పిల్లుల్ని ఎన్‌కౌంటర్ చేసేశారు."

"శివశివ... పిల్లి హత్య మహాపాతకం."

"పిల్లి హత్యయినా, మనిషి హత్యయినా పోలీసు లకి ఏ పాతకాలూ అంటవు," అంది ఝాన్సీ.

గాంధీజీ ఆదేశించినట్లు కోపము, ద్వేషము అనెడి చెడు ఆలోచనల నుంచి విముక్తి పొందిన పాపా రావుగారిని, టైగర్‌ని ప్రేమతో కౌగలించుకోడానికి పూల గుచ్ఛం, బిస్కెట్లు తీసుకుని పరిగెట్టాను.

కాలింగు బెల్లు నొక్కిన రెండు నిముషాలకు నీరసంగా తెరుచుకుంది తలుపు. ఎదురుగా పాపారావు గారు. నిద్రాహారాలు లేనట్లు మొహం పీక్కుపోయి ఉంది. ఈ ప్రమాదం ఆయనకే జరిగిందా అనిపించే తగా మారిపోయారు ఆయన. రాక్షసుడి ప్రాణాలు చిలుకలో ఉన్నట్లు పాపారావుగారి పంచప్రాణాలు టైగర్లో ఉన్నాయి కాబోలు. అది నేల కూలగానే ఆయనా కూలిపోయారు.

"ఎంత ఘోరం జరిగిపోయింది పాపారావు గారూ..." ఆయనని ప్రేమతో కౌగలించుకుని చేతిలో పూలగుచ్ఛం పెట్టి కళ్లనీళ్లు పెట్టుకున్నాను.

"పూలగుచ్ఛం ఇచ్చే సందర్భమా ఇది?" పాపా రావుగారు బాధపడ్డారు. నేను నాలిక కరుచుకున్నాను.

టైగర్ నన్ను చూసి తోకాడిస్తూ కుంయికుంయి మని మూలుగుతూ కుంటుకుంటూ వచ్చింది. ఊర పందిలా ఉండేది, ఎండునక్కలా తయారయింది. నేను దాన్నికూడా ప్రేమతో కౌగలించుకుని బిస్కెట్ అందించ బోయాను. అది బిస్కెట్ కేసి ఒకసారి ఆశగా చూసి, కళ్లనీళ్లు పెట్టుకుని, మొహం పక్కకి తిప్పింది.

"అది బిస్కెట్ తినలేదు. దవడ ఎముక విరిగిపో యింది. రెండు పక్కటెముకలు విరిగిపోయాయి. చెల్లెమ్మ సమయానికి చూసింది, కాబట్టి ఇల్లాగేనా మనకు దక్కింది," దీనంగా అన్నారు పాపారావుగారు.

"చెల్లెమ్మ ఎవరు?"

"నేనే," అంది ఝాన్సీ ఎంటరై.

ఝాన్సీ గొంతు వినగానే టైగర్ ఉలిక్కిపడి, కుంటికాలుతో ఎంత వేగంగా పరిగెట్టగలదో అంత వేగంగా పరిగెట్టి సోఫా వెనుక నక్కింది.

పిల్లి-కుక్కల మధ్య ఛేజింగ్ సీను జరుగు తున్నప్పుడు ఝాన్సీ టెర్రస్ మీద బట్టలు ఆరవేస్తోందట. టైగర్ కిందకు దూకగానే ఝాన్సీ పరిగెట్టి పాపారావు గారికి చెప్పిందట. పాపారావుగారు దాన్ని వెంటనే హాస్పిటలుకు తీసుకువెళ్లారు. కాబట్టి బతికి బయట పడిందట.

నాలాగా పీడ విరగడైందనుకోకుండా ఝాన్సీ టైగర్ ప్రాణాలు రక్షించడం నాకెంతో ఆనందం కలిగిం చింది. నా గాంధీగిరి ప్రభావం తనమీద కూడా బాగా పడిందన్నమాట.

"అవునూ, టైగర్ నిన్ను చూసి అలా భయపడు తోందేవిటి?" అన్నాను, సోఫా వెనుక నక్కి ఝాన్సీకేసి భయంభయంగా చూస్తున్న టైగర్‌కేసి చూస్తూ.

"నన్ను చూసి భయపడడవేమిటి? నా తల కాయ. నేనేమన్నా సింహాన్నా, పెద్దపులినా? దానికి ఏదో ఫోబియా పట్టుకున్నట్లుంది."

"ఏవిటోనండి, మనిషి కనిపిస్తే పులిలా దూకి మెడ పట్టుకునేది. అలాంటిది ఇలా మెంటలైపోయింది. నీడ చూస్తే బెదురుతోంది," పాపారావుగారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"మీరు అతిగా ఆలోచించి ఆందోళన పడకండి. మీరూ మెంటలైపోవచ్చు," అని పాపారావుగారికి స్నేహ పూర్వకమైన వార్నింగిచ్చి అటువంటి విషాద సందర్భా లలో ఊరట కలిగించే నాకు తెలిసిన నాలుగు ముక్కలూ చెప్పాను.

"దేన్ని గురించి మీరు బాధపడుతున్నారు పాపా రావుగారూ? టైగర్ కాళ్లు విరిగాయనా? కాళ్లు విరిగింది టైగర్ దేహానికే కాని ఆత్మకుకాదు. దేహం అనశ్వరమైన ఆత్మకు చొక్కాలాంటిది. చొక్కాలు, లాగులు చిరిగి పోయాయని మనం బాధపడతామా, సంతోషంగా కొత్త చొక్కా వేసుకుంటాంగాని. టైగర్ ఆత్మ ఈ జన్మలో కుక్క చొక్కా తొడుక్కుంది. కుక్క చొక్కా పుణ్యం చేస్తే మళ్లీ జన్మలో మీలా పోలీసు చొక్కా వేసుకుంటుంది. పోలీసు చొక్కా ఈ జన్మలో పాపం చేస్తే వచ్చే జన్మలో కుక్క చొక్కా తొడుక్కుంటుంది."

అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు ఆత్మ జ్ఞానం సోదాహరణంగా వివరిస్తున్న నా కళ్ల ముందు హఠాత్తుగా కుక్కచొక్కా తొడుక్కుని, టైగర్‌లా కాళ్లు, ఒళ్లు విరగ్గొట్టుకుని, నేలమీద పడి దీనంగా మూలుగు తున్న పాపారావుగారి రూపం ప్రత్యక్షమై ఉలిక్కిపడ్డాను. 'అయ్యో గన్ పాపారావుగారి వచ్చే జన్మ ఇంత హీనంగా ఉంటుందా?' అని బాధపడ్డాను.

నేను మాట్లాడుతున్నంతసేపూ పిచ్చిచూపులు చూస్తున్న పాపారావుగారికి, నేను మాటలు ఆపుచేసి, ఆయన ముందు జన్మ గురించి మనసులో దిగులు పడుతుంటే నోరు మెదపడానికి అవకాశం దొరికింది. "నాకు తలనొప్పిగా ఉంది. ఇక మీరు వెళ్లండి," అన్నారు.

"అహం బ్రహ్మాస్మి- మీ తలా దేవుడిదే, తలనొప్పి దేవుడిదే. ఆయన తల గురించి ఆయన వర్రీ అవాలి గాని మీరెందుకు బాధపడతారు?"

పాపారావుగారు మౌనంగా రెండు చేతులు జోడించి తలుపు చూపించారు. నీరసంగా నేను నమస్కరించి బయటకు నడిచాను.

"అమ్మో, ఎంత ఫిలాసఫీ మాట్లాడారు! చొక్కాలు, లాగులు అంటూ పోలీసు ఆత్మని అదరగొట్టేశారు," ఝాన్సీ ఆశ్చర్యంగా అంది. "పన్నెండువారాల బ్రహ్మచర్యంలోనే సన్యాసిరావుగారి జ్ఞాననాడి ఇంతగా వికసిస్తే పన్నెండు సంవత్సరాలు బ్రహ్మచర్యం పాటిస్తే ఇంకేమైనా ఉందా? ముల్లోకాలూ తల్లడిల్లి, ఇంద్రుడి సింహాసనం తల్లకిందులైపోదూ? అప్పుడు మీ వ్రత భంగం చెయ్యడానికి ఇంద్రుడు రంభనో, ఊర్వశినో, త్రిషనో, శ్రియనో పంపించక తప్పదు. అమ్మో! ఎంత ఫిలాసఫీ మాట్లాడారు?"

"దుఃఖంలో ఉన్న మనిషికి వేదాంతం ఊరట కలిగిస్తుంది. పాపారావుగారి మనస్సు కుదుటపడేవరకూ రోజూ ఒక గంట గీతారహస్యాలు, ఉపనిషత్సారం ఆయనకు వివరిస్తాను."

"రోజూ ఒక గంటా?"

"రోజూ ఒక గంట."

టైగర్ కాళ్లు విరిగి పులి పాపారావుగారు పిల్లి అయిపోవడంతో నా సమస్య తీరిపోయింది. కాని నాకు కొంచెం అసంతృప్తిగా ఉంది. 'నిజంగా గాంధీగిరి వల్లనే టైగర్‌నీ, పాపారావుగారినీ మార్చగలిగానా' అన్న అనుమానం వచ్చింది. 'యాదృచ్ఛికంగా అలా జరిగింది కాని నువ్వు నిజాయితీగా సత్యాహింసల మార్గంలోనే నడిచావు నాయనా," అని గాంధీ ఊరడించినా నా అసంతృప్తి అలాగే ఉంది.

"ఇప్పుడెందుకీ వృధా ఆలోచనలు? కాగల కార్యం గంధర్వులు తీర్చారు కదా," వంకరగా నవ్వింది ఝాన్సీ. ఆ వంకర నవ్వు ఏదో దాస్తున్నట్టనిపించింది.

"ఏవిటి? అలా వంకరగా నవ్వుతున్నావు?"

"నా మొహం వంకరగా ఉందో, లేకపోతే మీకు మెల్ల కన్నో. నా నవ్వు వంకరగా కనిపించి ఉంటుంది," మళ్లీ వంకరగా నవ్వింది ఝాన్సీ.

నాకు అనుమానం వచ్చింది. "అవునూ టైగర్ నిన్ను చూసి గజగజ వణికి పోయిందేవిటి?"

"ఆడభీముడు ఆడ యముడిలా కనిపించిందేమో?"

"వేళాకోళం కాదు. సీరియస్‌గా అడుగుతున్నాను. అసలేం జరిగింది?"

"నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?"

"నేను అసత్యం సహించలేను... నిజమే చెప్పు."

"టైగర్ నల్లపిల్లిని తరుముతూ టెర్రస్ మీంచి దూకి కాళ్లు విరగ్గొట్టుకున్న మాట అబద్ధం..." అంటూ మొదలుపెట్టింది ఝాన్సీ.

నేను టూరుకి వెళ్లాకా టైగర్ రాత్రీపగలూ ఝాన్సీని బిస్కెట్ల కోసం వేధించేదట. పడకగది కిటికీ కింద కూర్చుని ఇరవైనాలుగు గంటలూ మొరుగుతూ నిద్రపోనిచ్చేది కాదట. ఝాన్సీకి చికాకు వేసుకొచ్చి, ఒక రోజు బిస్కెట్లు చూపిస్తూ టైగర్‌ని టెర్రస్ మీదకు తీసుకుపోయిందట. అక్కడ పిట్టగోడ మీద బిస్కెట్లు పెట్టిందట. టైగర్ ముందు కాళ్లు రెండూ పైకెత్తి పిట్టగోడ మీద వేసి బిస్కెట్ అందుకోబోతుంటే...

"దాని వెనక కాళ్లు పట్టుకుని గాలిలో గిరగిర తిప్పి కిందకు విసిరేశాను..." అంది ఝాన్సీ కూల్‌గా.

మహిషాసురమర్దినిలా టైగర్‌ని గాలిలో తిప్పి విసురుతున్న ఝాన్సీ కళ్ల ముందు మెదిలి నాకు షాక్ తగిలినట్లయింది. గాంధీజీ ఒకక్షణం అవాక్కయ్యారు. మరుక్షణం తేరుకుని, "ఇది హింస. ఇది నా మార్గం కాదు," అన్నారు ఆవేశంగా.

"ఇది గూండాగిరి, గాంధీగిరి కాదు. ఈ గూండాగిరి నేను సహించను. ఇప్పుడే పాపారావుగారికి జరిగిందంతా చెబుతాను," అన్నాను నేనూ ఆవేశంగా.

"వెళ్లు నాయనా," గాంధీజీ అన్నారు. "శత్రువు ఎంత నియంతయైనను అతనికి రవంత హానియైనను కలుగకూడదన్నది నా సిద్ధాంతం. దోషాన్ని అంగీకరించడమే ప్రాయశ్చిత్తం. వెళ్లు నాయనా..."

"నువ్వు చేసిన పాపానికి నేను ప్రాయశ్చిత్తం చేస్తాను," అంటూ లేచాను.

"శిష్టరక్షణ, దుష్టశిక్షణ ఉత్తముల మార్గం అని లోకం అంటుంటే, నువ్వు శిష్టశిక్షణకు, దుష్టరక్షణకు కంకణం కట్టుకున్నావన్నమాట. ఎంత గొప్పవాడివి మహాత్మా," అంది ఝాన్సీ.

"నువ్వు ఎలా అనుకున్నా సరే. నా దృష్టిలో సత్యమే అన్నింటికన్నా గొప్పది. సత్యం అంటే సాక్షాత్ పరబ్రహ్మమే. నేను సత్యశోధకుడిని..."

ఝాన్సీ నాకేసి జాలిగా చూస్తూ అంది. "పిచ్చి మహాత్మా..." గాంధీజీ ఉలిక్కిపడ్డారు. "మిమ్మల్ని కాదు మహాత్మా, ఝాన్సీ నన్ను అంటోంది," అని గాంధీజీకి క్షమార్పణలు చెప్పాను.

"సత్యశోధకుడు సత్యాన్ని స్థలకాల పరిస్థితులలో, అన్ని కోణాల నుంచీ దర్శించాలి కాని సత్యాహింసలు, శుష్క ఆదర్శాలు కాకూడదు..." ఝూన్సీ చెప్పసాగింది.

"...కురుక్షేత్రంలో ధర్మరాజంతటి వాడు అసత్యం ఎందుకు పలకాల్సి వచ్చిందో తెలుసా? అసత్యం చెప్పి ద్రోణాచార్యులవారిని యుద్ధరంగం నుంచి తొలగించకపోతే ఓడిపోయి, అధర్మం గెలిచేది. ఈ సందర్భంలో సత్యం ధర్మ పరాజయానికీ, అదర్శ విజయానికీ దారి తీసే వింత పరిస్థితి ఏర్పడింది. సత్యపాలనలో ఇటువంటి చిక్కులున్నాయి. కనుకనే మన పెద్దలు కొన్ని సందర్భాలలో అసత్యమాడినా దోషం లేదు అన్నారు. ఆరునెలల్లో రోగి మరణం ఖాయం అని తెలిసిన డాక్టరు, ఎల్లప్పుడూ సత్యమునే పలుకవలెను అంటూ సత్యం చెప్పి రోగిని వెంటనే చంపెయ్యకూడదు కదా..."

నేను మహాత్ములకేసి చూశాను. ఆయన నిశ్చలంగా కూర్చుని వింటున్నారు.

"రాముడు ధనుర్బాణాలు తీసుకుని రావణాసురుడి డొక్క చీల్చేశాడు కాని లంకా నగరం ముందు టెంటేసుకు కూర్చుని నిరాహారదీక్ష చెయ్యలేదు కదా..." ఝూన్సీ అంది.

"...సూదిమొన మోపినంత భూమి కూడా ఇవ్వనని దుర్యోధనుడు మొండికేస్తే, శ్రీకృష్ణుడు యుద్ధం చేసి రాజ్యం గెలుచుకోమని అర్జునుడికి చెప్పాడు కాని సత్యాగ్రహం చెయ్యమనలేదు కదా! దేవుళ్లే మంచి మాటలతో దుర్మార్గులని సన్మార్గంలోకి తీసుకు రాలేకపోతే మనుషులకెలా సాధ్యపడుతుంది? మంచి మాటలకు దెయ్యం దిగి రాకపోతే బెత్తం ఝుళిపించాల్సిందే..."

నేను ఆలోచనలో పడ్డాను. ఝూన్సీ అన్నదానిలో నిజం లేకపోలేదు అనిపించింది. గాంధీజీ నాలో చెలరేగుతున్న ఆలోచనలు గమనించారు.

"నాయనా, సత్యంతో నా ప్రయోగాలు పూర్ణత్వం పొందాయని కాని, నా ప్రయోగాల పరిణామాలే సరియైనవని కాని నేను ఎన్నడూ చెప్పలేదు. నా దృష్టిలో మాత్రం అవి సరియైనవి. ఈ జగత్తులో సత్యం తప్ప మరొకటి లేదు. ఈ సత్యం స్థూలంగా ఉండే వాక్సత్యం మాత్రమే కాదు. ఇది భావానికి సంబంధించిన సత్యం కూడా. పరమేశ్వరుడొకడే సత్యం. ఆ సత్య సాక్షాత్కారం కలుగనంతవరకూ, ఎవరేమనుకున్నా సరే, నా అంతరాత్మ దేన్ని సత్యమని నమ్ముతుందో, ఆ కాల్పనిక సత్యాన్ని నేను అనుసరిస్తాను. ఇదే నా మార్గం..." అన్నారు గాంధీజీ.

నాకు ఏవీ పాలుపోక ఆలోచిస్తూ ఉండిపోయాను.

"ఏవిటి? పుస్తకం ఒళ్లో పెట్టుకుని పెద్ద ఫిలాసఫర్లా శూన్యంలోకి చూస్తూ సీరియస్‌గా ఆలోచిస్తున్నారు?" ఝూన్సీ అడిగింది.

"ఏది సత్యం, ఏది అసత్యం, ఏది హింస, ఏది అహింస? గాంధీజీకి లోకం అర్థంకాలేదా లేక లోకానికి గాంధీజీ అర్థంకాలేదా? నాకేవీ అర్థం కావట్లేదు..."

"అంత సీరియస్ విషయాల గురించి ఎక్కువగా ఆలోచించకండి. మీ బుర్ర అసలే డెలికేట్. టీవీ సీరియల్సును మించిన లోడు భరించలేదు. ఎక్కువ శ్రమ పెడితే హీటెక్కి, ఫ్యూజెగిరిపోగలదు. ఈ విషయాలన్నీ పెద్ద బుర్రలకి వదిలేద్దాంగానీ ఇంతకీ మీ ప్రయోగాలన్నీ పూర్తయ్యాయా ఇంకా మిగిలాయా?" ఝూన్సీ కళ్లల్లో ఓ కొంటెనవ్వు మెరిసింది. "ఏ ప్రయోగాలు చేస్తానన్నా నా ఫుల్ కోఆపరేషనుంటుంది..." అంది, 'ఏ ప్రయోగాలైనా,' అన్న పదం సాగదీస్తూ.

"ఇదేదో డబుల్ మీనింగ్ సినిమా డైలాగులాగుంది," అన్నాను అనుమానంగా.

"ఇందులో డబుల్ మీనింగేం ఉంది. సరిగా అర్థం చేసుకుంటే సింగిల్ మీనింగే..." అంది. ఈసారి, 'సింగిల్ మీనింగ్,' అన్న పదం సాగదీస్తూ.

"ఈ సింగిల్ మీనింగులో మళ్లీ డబుల్ మీనింగు కనిపిస్తోంది..."

"రామరామ... రామ అంటే బూతుమాట లాగా ఉంది మీకు. అయ్యో! పొయ్యి మీద పాలు మరుగుతున్నాయి మర్చేపోయాను," అంటూ వంటింటివైపు నడిచింది ఝూన్సీ.

ఝూన్సీ అలా వేగంగా నడుస్తుంటే, ఆ నడుం ఊపు, జడ ఊపు కలవరపాటుతో రెప్ప వెయ్యకుండా చూస్తున్న నన్ను గాంధీజీ హెచ్చరించాడు. "నాయనా, బ్రహ్మచర్య వ్రతమే నన్ను సత్యాగ్రహ సంగ్రామ ప్రారంభానికి పూనుకొనేలా చేసింది. బ్రహ్మచర్య మహిమకు ఎల్లలు లేవు." గాంధీజీ బ్రహ్మచర్య మహత్తును నాకు గుర్తుచేసి, "మనసులో అనేక వికారాలు కలుగుతూ ఉంటాయి. మనసును అదుపులో పెట్టాలంటే రామకృప కావాలి. రామనామం జపించు..." అని సలహా ఇచ్చారు.

నేను కళ్లు మూసుకుని రామభజన చెయ్య సాగాను. 'సంసార జలధి దాటించగలదీ రెండక్షరముల నామమే, జయశ్రీరామచంద్రుని నామమే...'

"ఏవిటి? కళ్లు మూసుకుని ఏదో ధ్యానం చేస్తున్నారు?" ఝాన్సీ గొంతు వినిపించి కళ్లు తెరిచి, నోరు తెరిచాను. ఎదురుగా తెల్లచీర, తెల్ల జాకెట్టులో ఝాన్సీ-స్నానం చేసి వచ్చినట్లుంది. మంచులో కడిగిన మల్లె పువ్వులా మెరిసిపోతోంది. నాతో మాట్లాడుతూ, జడలో మల్లెపూలు పెట్టుకునే ప్రయత్నంలో రెండు చేతులూ పైకెత్తి వెనక్కు మడిచింది. ఆ దృశ్యం కంటపడంతో నా మనసు వంశం తప్పింది.

'ఈ పిల్ల ఇవ్వాళ నా కొంప ముంచడానికి కంకణం కట్టుకున్నట్లుంది,' అని కంగారుపడుతూ, మళ్లీ కళ్లు మూసుకుని రామనామం జపించడం మొదలుపెట్టాను.

'జయశ్రీ... రామచంద్రుడు...చంద్రుడు... వెన్నెల... ఝాన్సీ!'

తపోభంగమైంది.

"విశ్వామిత్రుడు ముందు మేనకలా నువ్వలా ఫ్రంటు ప్రొఫైలు, బేక్ ప్రొఫైలు చూపించి రెచ్చ గొట్టొద్దు," అన్నాను గట్టిగా.

"బావుంది? చేతులు కింద ఉంచి జడలో పూలెలా పెట్టుకోను? పోనీ మీరు పెట్టండి," అంటూ ఝాన్సీ దండ నా చేతిలో పెట్టి వెనక్కు తిరిగి నన్ను తగిలేలా నిలబడింది. అగ్గికి, పెట్రోలుకీ మధ్య దూరం అంతమయింది.

మంత్రించబడినవాడిలా ఝాన్సీ జడలో పూలు పెట్టి, చెంపలు నిమిరి, చేతులు కొంచెం కిందికి జరిపి భుజాలు నొక్కి, ఇంకొంచెం కిందికి జరిపి నడుం చుట్టూ బిగిస్తుంటే...

"నాయనా, నిగ్రహం కోల్పోతున్నావు," నిస్పృహగా అన్నారు గాంధీజీ. నేను ఠక్కున చేతులు తీసేశాను కాని గెలుపు మేనకదే అయింది.

"మహాత్మా నన్ను క్షమించండి..." నేను రెండు చేతులూ జోడించి నమస్కరించాను. "తమరు... ఇంక... ఈ గదిలో ఉండడం... భావ్యం కాదు..."

*విపుల మాసపత్రిక, ఫిబ్రవరి 2008*

